

చేతబడి నెపంతో గిరిజన మహిళ హత్య - II

చేతబడి చేసిందనే నెపంతో ఒక గిరిజన మహిళను ఒక యువకుడు పీక కోసి హత్య చేసిన ఘటన దేవీపట్నం మండలం డి.ఎస్.పాలెంలో జరిగింది.



వరద బాధితులకు వితరణ - II

విశ్రాంత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు వరద బాధితులకు అండగా నిలిచారు. 250 కుటుంబాలకు వారు నిత్యావసర సరకులతో పాటు దుప్పట్లు, వంటపాత్రలు పంపిణీ చేశారు

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

- అనకాపల్లి ఏడీ రామారావు హెచ్చరిక
- దేవరాపల్లిలో పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



- II

న్యూస్‌రీల్

జడ్డంగి పీహెచ్‌సీ తనిఖీ

- క్షుణ్ణంగా పరిశీలించిన ఎన్‌క్యూఏఎస్ టీమ్



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న ఢిల్లీ నుంచి వచ్చిన డాక్టర్ల బృందం

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పీహెచ్‌సీని నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్- ఢిల్లీ) ప్రతినిధులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ బృందంలో డాక్టర్ అమరేష్ త్రిపాఠి, డాక్టర్ గుణశీల, డాక్టర్ రాకేష్ ఉన్నారు. వీరు తొలుత రికార్డులు, ఆస్పత్రిలో అన్ని గదులను పరిశీలించి, ఓపీ ఏవిధంగా నమోదు చేస్తున్నదీ తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీ అధికారులు, సిబ్బందికి డాక్టర్ అమరేష్ త్రిపాఠి, డాక్టర్ గుణశీల పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సుజీ మాట్లాడుతూ ఆస్పత్రి పరిధిలోని 17వేల మందికి సేవలందిస్తున్నట్టు చెప్పారు. పీహెచ్‌సీకి మరో రెగ్యులర్ డాక్టర్ అవసరమన్నారు. రంపచోడవరం ఏడీఎం అండ్‌హెచ్‌వో అనూష, హెచ్‌సీవోలు పీటర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ

కొయ్యూరు: గిరిజన నిరుద్యోగ యువతకు వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు డౌనూరుకు చెందిన సిఫా సంస్థ సోమవారం తెలిపింది. నిరక్షరాస్యులకు కూడా శిక్షణ ఇస్తామని పేర్కొంది. బేసిక్ కంప్యూటర్స్, ఫొటోషాప్, డెస్కటాప్ పబ్లిషింగ్, టైలరింగ్, మోడరన్ బ్లౌజ్ స్టిచింగ్, ఫినాయిల్, సర్ఫ్,విస్తరాకులు, కొండచీపుళ్లు, చింతపండు అచ్చుల తయారీ,గ్యాస్ స్టౌ మరమ్మతులపై ఒక్క రోజు నుంచి రెండు నెలల వరకు శిక్షణ ఉంటుందని తెలిపింది. పూర్తి వివరాల కోసం 9908725778, 9550268835 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొంది.

9న అడ్డతీగలలో జాబ్‌డ్రైవ్

అడ్డతీగల: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 9న అడ్డతీగల వైటీసీలో ఇండస్ట్రీ కస్టమైజ్డ్ ట్రైనింగ్ జాబ్‌డ్రైవ్ నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.రోహిణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న ఈ జాబ్‌డ్రైవ్‌లో ప్రముఖ కంపెనీ అయిన అరబిందో ఫౌండేషన్ పాల్గొంటుందన్నారు. బీఎస్సీ నర్సింగ్, బీజెడ్సీ, బీఎస్సీ ఎంఎల్‌టీ, బిఫార్మసీ, జీఎన్‌ఎం పూర్తిచేసిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. జాబ్‌డ్రైవ్‌కి వచ్చే అభ్యర్థులు ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 63046 34447 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

స్పందనలో సమస్యల పరిష్కారం

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



స్పందనలో ఆర్జీలు స్వీకరిస్తున్న పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ సింహాచలం

రంపచోడవరం: మారుమూల గ్రామాలకు చెందిన గిరిజనుల సమస్యలను స్పందన కార్యక్రమంలో పరిష్కరించినట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం సబ్ కలెక్టర్ కట్టా సింహాచలం, ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ సుమారు 50 మంది అర్జీలు అందజేసినట్టు తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి పలువురు వినతులు అందజేసినట్టు చెప్పారు. అడ్డతీగలలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేసినట్టు పీవో తెలిపారు.

మోహనాపురంలోని ఆశ్రమ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని ఆదివాసీ చైతన్య వేదిక సంఘం అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి కోరారు. మారేడుమిల్లి మండలం పుల్లంగి పంచాయతీలోని గుడిసె పర్యాటక ప్రాంతం సందర్శనకు అనుమతించాలని సర్పంచ్ వి. జార్జిబాబు కోరారు. వాడపల్లి పీహెచ్‌సీలో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని గ్రామస్తులు అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఈఈ డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత గురువులదే

- కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు : విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని, వారి భవిష్యత్ ఉపాధ్యాయులపైనే ఆధారపడి ఉందని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిపై సమాజంలో అపారమైన గౌరవం ఉందని, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల శ్రమ నన్ను ఇంతటి స్థాయికి చేర్చిందని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని ఉపాధ్యాయులు కొండలు, గుట్టలు ఎక్కి పాఠశాలలకు వెళ్తున్న కష్టాలు నాకు తెలుసన్నారు. ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో అక్షరాస్యత శాతం పెంచేందుకు గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించిందని చెప్పారు. గిరిపుత్రులకు ఐఐటీ, జేఈఈ, నీట్, ఎంసెట్, లాసెట్ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నామని, 60 మంది గిరిజన అభ్యర్థులు సివిల్స్ కోచింగ్ పొందుతుండడం శుభపరిణామమని తెలిపారు. ఏజెన్సీలో క్రీడాపాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.40 కోట్లు విడుదల చేసిందని చెప్పారు.

106 మంది ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని 22 మండలాల పరిధిలో 106 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు.

డీఈవో డాక్టర్ పి.రమేష్‌తో పాటు పలు మండలాల ఎంఈవోలు, ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంలను, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావును కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలకు చెందిన గిరిజన విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పలు మండలాల ఎంఈవోలు, ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, డీఈవో డాక్టర్ రమేష్, పాడేరు ఏటీడబ్ల్యూవో రజని, హెచ్‌ఎం పూర్ణచందర్‌రావులను సన్మానిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సత్వరమే గిరిజన రైతుల భూముల మ్యుటేషన్

- జేసీ శివశ్రీనివాస్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శివశ్రీనివాస్

రంపచోడవరం: గిరిజన రైతుల భూములను వెంటనే మ్యుటేషన్ చేయాలని జేసీ శివశ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో ఏడు మండలాల తహసీల్దార్‌లతో ఈ క్రాప్, జాతీయ రహదారి, భూముల మ్యుటేషన్‌పై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గిరిజన రైతులకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందే విధంగా భూములను మ్యుటేషన్ చేయాలన్నారు. ఒక కుటుంబంలో ఇంటి యజమాని పేరు మీద ఎక్కువ భూమి ఉంటే వారసుల పేరుతో విడగొట్టి మ్యుటేషన్ చేయాలన్నారు. గిరిజనుల భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. రంపచోడవరం నుంచి రాజవొమ్మంగి మండలం మీదుగా జాతీయ రహదారి కోసం చేసిన సర్వేపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.ఎస్.వి. ప్రసాద్, సుబ్రమణ్యం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వ్యాధి నిర్ధారణ

- వైద్య సిబ్బందికి ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశం

అడ్డతీగల: సకాలంలో వ్యాధి నిర్ధారణ చేసి, రోగులకు తగిన మందులు అందజేయాలని వైద్య సిబ్బందికి రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. సోమవారం ఆయన అడ్డతీగల మండలం ఎల్లవరం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఓపీతో పాటు మందుల నిల్వలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరాలు,డెంగ్యూ,రక్తహీనత వంటి అనారోగ్య సమస్యలతో వచ్చే రోగులకు ముందుగా రక్తపరీక్షలు చేసి, వెంటనే మందులు అందజేయాలన్నారు. మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నెలలు నిండిన గర్భిణులను 15 రోజుల ముందుగానే సమీపంలోని ఆస్పత్రికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలన్నారు. సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.వైద్యాధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లవరం పీహెచ్‌సీలో రక్తపరీక్షల నిర్వహణపై ఆరా తీస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

ఏకలవ్య స్థల వివాదంపై పరిశీలన

అడ్డతీగల మండలం వేటమామిడి వద్ద ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణానికి నిర్ణయించిన స్థల వివాదంపై ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే సోమవారం స్వయంగా పరిశీలించారు. రెవెన్యూ,అటవీశాఖల అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ పాఠశాల భవన నిర్మాణంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సంబంధిత రెవెన్యూ,అటవీశాఖల అధికారులను పీవో ఆదేశించారు. రేంజి అధికారి లలితకుమారి, సర్వేయర్ గోవిందరాజులు, ఇతరసిబ్బంది పాల్గొన్నారు.

● ఉత్తమ గురువులకు పురస్కారాలు



విజయవాడలో సోమవారం నిర్వహించిన గురుపూజోత్సవం కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుంటున్న పెదబయలు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1 ప్రధానోపాధ్యాయుడు టి.నాగేశ్వరరావు, అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పాంగి సూరిబాబు

సమాచార వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వాలు కృషి

- అరకు ఎంపీ గొడ్డేటి మాధవి

హుకుంపేట : జిల్లాలో పెద్ద సంఖ్యలో సెల్ టవర్లు ఏర్పాటు చేసి, సమాచార వ్యవస్థ బలోపేతానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి తెలిపారు. గిరిజన ప్రాంతంలో సిగ్నల్ సమస్యపై పలుమార్లు పార్లమెంట్‌లో చర్చించినట్టు చెప్పారు. మండలంలోని భీమవరంలో జియో సెల్‌టవర్ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గిరిజనులకు చేరడానికి సెల్ సిగ్నల్స్ అవసరమన్నారు. తమ గ్రామంలో సైతం సిగ్నల్ సమస్యతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. సెల్ టవర్ల నిర్మాణాలకు అందరూ సహకరించాలని కోరారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ 162 టవర్ల నిర్మాణానికి జియో సంస్థకు స్థలాలు అప్పగించినట్టు చెప్పారు. మరో 50 స్థలాలను త్వరలోనే అప్పగిస్తామన్నారు. ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ మాట్లాడుతూ భీమవరంతో పాటు గరుడాపల్లి, పెదకోడపల్లి, కుంతుర్ల తదితర ఐదు ప్రాంతాల్లో సెల్ టవర్ల నిర్మాణాలు ప్రారంభించినట్టు చెప్పారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో 653 సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. 16 నెలల్లో టవర్ల నిర్మాణాలు పూర్తవుతాయని చెప్పారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సెల్ టవర్ల నిర్మాణానికి అన్ని విధాల సాయం అందిస్తామన్నారు. జియో సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆర్డినేటర్ బి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 700 టవర్లను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అభిషేక్, ఎస్పీ సతీష్ కుమార్, స్థానిక ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం,ఎంపీటీసీ నైని రజని, సర్పంచ్ నైని సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మాధవి,చిత్రంలో కలెక్టర్ సుమిత్ కుమార్, పీవో గోపాలకృష్ణ, ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ,భాగ్యలక్ష్మి తదితరులు



భీమవరంలో సెల్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మాధవి

మానవత్వం చాటుకున్న రాజేంద్రపాలెం వైద్యుడు

- గాయపడిన వారికి ప్రమాద స్థలం వద్ద చికిత్స

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం వైద్యుడు సంపత్‌బాబు సకాలంలో స్పందించడంతో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ట్రాక్టర్ కింద చిక్కుకుపోయిన వారిని ఇతరుల సాయంతో బయటకు తీసి, ప్రమాద స్థలంలోనే ప్రాథమిక చికిత్స అందజేసి మానవత్వం చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణదేవిపేటకు చెందిన ట్రాక్టర్ ఇటుక లోడుతో సోమవారం కొయ్యూరు వైపు వస్తోంది. చింతాలమ్మ ఘాట్ వద్దకు వచ్చేటప్పటికి అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్‌పై ఉన్న నలుగురిలో అరడ వసంత కుమారి,అరడ చిన్నభాయిలు వాహనం కింద చిక్కుకుపోయారు.అదే సమయంలో అటువైపుగా వస్తున్న వైద్యుడు సంపత్‌బాబు ఇతరుల సాయంతో ట్రాక్టర్ కింద చిక్కుకుపోయిన వారిని బయటకు తీశారు.వారికి ప్రాథమిక చికిత్స చేసి తన కారులో రాజేంద్రపాలెం ఆస్పత్రికి తీసుకువచ్చారు.ఇక్కడ పూర్తిస్థాయిలో చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంపత్‌బాబు సకాలంలో వైద్యం అందించకుంటే బాధితుల పరిస్థితి ఆందోళనకరంగా ఉండేదని స్థానికులు తెలిపారు. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.



గాయపడిన మహిళకు చికిత్స చేస్తున్న వైద్యుడు సంపత్‌బాబు

ఎ ఫర్ అంగన్‌వాడీ

ఉప్మా బదులుగా చులకన భావన ఉండే అంగన్‌వాడీ కేంద్రాలు ఇప్పుడు ఇంగ్లిష్ చదువులకు పునాది వేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా వీటిని తీర్చిదిద్దడంతో పిల్లలకు ఇటు సంపూర్ణ పౌష్టికాహారం అందజేయడంతో పాటు ప్రాథమిక పాఠశాలకు వెళ్లేందుకు సన్నద్ధం చేస్తున్నాయి. మరో వైపు ఇంగ్లిష్ చదువులకు బీజం వేస్తుండడంతో ఈ కేంద్రాలకు తమ పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

- ఇంగ్లిషు చదువులకు పునాది ప్రీ ప్రైమరీ పాఠశాలలు
- పీపీ పుస్తకాల ద్వారా బోధన
- కేంద్రాల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు

రంపచోడవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రీ ప్రైమరీ విద్య విధానం మంచి ఫలితాలను ఇస్తోంది. నాడు-నేడు ద్వారా అంగన్‌వాడీల రూపురేఖలు మారుస్తుండడమే కాకుండా వాటిని ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా గుర్తించి, అక్కడకు వస్తున్న చిన్నారులను ప్రాథమిక పాఠశాలలకు వెళ్లేందుకు సన్నద్ధం చేస్తున్నారు. గత ఏడాది ప్రారంభమైన ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చిన్నారులకు ఆంగ్ల విద్యను బోధించేందుకు అంగన్‌వాడీ టీచర్లను కూడా తగిన విధంగా సిద్ధం చేశారు. అంగన్‌వాడీ సెంటర్లల్లో విద్యతో పాటు సంపూర్ణ పోషక ఆహారం అందిస్తుండడంతో చిన్నారుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బేసిక్స్ బోధన

మూడేళ్ల వయస్సులో అంగన్‌వాడీ సెంటర్‌లో చేరిన చిన్నారులు రెండు సంవత్సరాలు అక్కడే ఉంటారు. ఈ రెండేళ్లు ప్రాథమిక విద్యకు కావాల్సిన బేసిక్స్‌ను నేర్పిస్తున్నారు. వీటిని ప్రీ ప్రైమరీ స్కూళ్లగా మార్చిన తరువాత బోధనపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. చిన్నారులు పీపీ-1 పూర్తి చేసిన తరువాత పీపీ -2 చదువుతారు.ఏడాదికి నాలుగు పుస్తకాల చొప్పున రెండేళ్లలో ఎనిమిది పుస్తకాలలో అంశాలను బోధిస్తారు. వీటిలో ఇంగ్లిషు, లెక్కలు, స్పోకెన్ ఇంగ్లిషు, యాక్టివిటీస్ ఉన్నాయి. ఇంగ్లిషు అక్షరాలను, చిన్న పదాలను నేర్పుతారు. బొమ్మలకు రంగులు వేసేందుకు కలర్ క్రేయన్స్ కూడా చిన్నారులకు ఇస్తున్నారు. విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెంచడంతో పాటు వారి సామర్థ్యాలకు పదును పెడుతున్నారు.

ప్రాథమిక విద్యకు (ఐదో తరగతికి) వెళ్లేందుకు చిన్నారులను తీర్చిదిద్దుతున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా మంచి పోషకాహారం అందిస్తున్నారు. పాలు, ఉడికించిన కోడి గుడ్డును ఉదయం అల్పాహారంగా ఇస్తున్నారు. కూరగాయలతో సాంబారు, కోడి గుడ్డు కూర, మునగాకు, గుడ్డు కూర, పులిహోర, అన్నం, ఎగ్ ఫ్రైడ్‌రైస్, వెజిటబుల్ రైస్ అందిస్తున్నారు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

డివిజన్ పేరు	అంగన్‌వాడీ కేంద్రాలు	మినీ అంగన్‌వాడీలు	3-4 సంవత్సరాల విద్యార్థుల సంఖ్య
పాడేరు	1122	1146	33,248
రంపచోడవరం	669	1423	14,489



ప్రీ ప్రైమరీ (అంగన్‌వాడీ కేంద్రం)లో చదువుకుంటున్న చిన్నారులు



పాఠ్య పుస్తకాలు

ఇంగ్లిషు మీడియంలో సులభంగా చదవొచ్చు



ప్రస్తుతం ప్రీ ప్రైమరీ స్కూల్‌లో చేస్తున్న బోధన వల్ల చిన్నారులకు ఇంగ్లిషు అంటే భయం పోతుంది. ఇక్కడ బేసిక్స్ నేర్పించి పంపడంతో ప్రాథమిక పాఠశాలకు వెళ్లిన తరువాత ఇంగ్లిషు మీడియంలో సులభంగా చదువుకోవచ్చు. ప్రీ ప్రైమరీ స్కూల్ ఇంగ్లిషు మీడియం చదువుకు పునాది అవుతుంది.అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ స్కూళ్లు నిర్వహిస్తున్నారు.

– సూర్యలక్ష్మి, పీడీ, మాతాశిశు సంరక్షణ అధికారి, పాడేరు

క్లుప్తంగా

వారపు సంతలో సీఆర్‌పీఎఫ్ సేవలు



పేదలకు భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరం వారపు సంతలో సోమవారం సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల ఆధ్వర్యంలో పేదలకు భోజనం పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి సంతకు వచ్చిన సుమారు 180 మంది పేదలకు భోజనం, వాటర్ ప్యాకెట్లను అందజేసినట్టు సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఇన్‌చార్జి బాబి

పాడేరు రూరల్: పాడేరులో బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజారావు అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌చార్జి బి.బాబి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 30 వీధి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రధాని జన్మదిన వేడుకలు 17న ఘనంగా నిర్వహించాలన్నారు. ఉమామహేశ్వరరావు, శాంతకుమారి, కృష్ణారావు, భారతి తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి జీవితం ఉపాధ్యాయులకు ఆదర్శం



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డాక్టర్ నర్సింగరావు, నేతలు



సీఏహెచ్ స్కూల్‌లో పార్కును ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

- అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: ఉపాధ్యాయుడైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతి స్థాయికి ఎదిగి గురువులందరికీ ఆదర్శంగా నిలిచారని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, ఇతర నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని ఉపాధ్యాయులంతా గిరిజన విద్యాభివృద్ధికి మరింత కృషి చేయాలని, అక్షరాస్యత శాతం పెంచేందుకు కష్టించి పనిచేయాలన్నారు. ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో నాడు–నేడు కార్యక్రమం ద్వారా మౌలిక సదుపాయాలను కల్పిస్తోందని, ఉపాధ్యాయులకు కూడా ప్రభుత్వం తగిన గుర్తింపునిచ్చి వారి సమస్యలను కూడా పరిష్కరిస్తోందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర, సర్పంచులు సీదరి రాంబాబు, వంతాల రాంబాబు, లంకెల చిట్టమ్మ, ఎంపీటీసీ సభ్యులు గిడ్డి విజయలక్ష్మి, కె.నర్సింహమూర్తి, మాజీ సర్పంచ్ కన్నాపాత్రుడు, పాస్టర్ బాబురావు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సమాజంలో అగ్రస్థానం

సాక్షి,పాడేరు : అక్షర జ్ఞానాన్ని అందిస్తున్న ఉపాధ్యాయులకు సమాజంలో అగ్రస్థానం ఉందని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుల సొంత నిధులతో నిర్మించిన రోణంకి పార్కు, ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఐటీడీఏ పీవో సోమవారం ప్రారంభించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఐటీడీఏ పీవో, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ తాను కూడా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన తరువాత ఐఏఎస్ సాధించానని చెప్పారు. ఆశ్రమ పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది సొంత నిధులతో పార్కు, గ్రంథాలయాలను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణను గిరిజన సంక్షేమ డీడీ ఐ.కొండలరావు, హెచ్ఎం రీమలి జాన్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పలాసి కృష్ణారావు, ఉపాధ్యాయులు కె.రామారావు, ఆర్.సూర్యనారాయణ, చిట్టిపడాల్, విజేంద్రనాథ్ తదితరులు ఘనంగా సన్మానించారు.

విద్యుత్‌షాకుతో గుర్రం మృతి

జి.మాడుగుల : మండలంలో కిల్లంకోట పంచాయతీ లువ్వాపల్లి గ్రామం సమీపాన గుర్రం పై నిత్యవసరసరుకులు తరలిస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురైన గుర్రం అక్కడకక్కడే మృతి చెందింది. రాసవీధి గ్రామానికి చెందిన తల్లే భాస్కరరావు సోమవారం సాయంత్రం మద్దిగరువు నుంచి కిల్లంకోట గ్రామానికి నిత్యవసర సరుకులను గుర్రం పై తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. లువ్వాపల్లి గ్రామ సమీపంలో గల విద్యుత్ స్తంభానికి అతి దగ్గరగా గుర్రం వెళ్లడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడకక్కడే తీవ్రంగా గాయపడి మృతి చెందినట్టు గుర్రం యజమాని భాస్కరరావు తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన నిత్యసర సరుకులు గుర్రంపై తరలించగా వచ్చిన నగదుతో భాస్కరరావు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గుర్రం మృతి చెందడంతో జీవనోపాధి కోల్పోయిందని ఆయన కన్నీటి పర్యంతమయ్యాడు. సుమారు రూ.50వేలు నష్టం వాటిల్లిందని ఆయన చెప్పారు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గుర్రం

మన్యంలో పొంచి ఉన్న

ప్లాస్టిక్ ముప్పు



పర్యాటక ప్రదేశంలో ప్లాస్టిక్ వ్యర్థాలు

- పర్యాటక ప్రదేశాల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు
- చెత్త తొట్టెలున్నా పట్టించుకోని పర్యాటకులు

మారేడుమిల్లి: మన్య ప్రాంతాన్ని ప్లాస్టిక్ భూతం వెంటాడుతోంది. ప్లాస్టిక్‌ను విచక్షణ రహితంగా వినియోగిస్తూ ఎక్కడిపడితే అక్కడ చెత్త పారేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మన్యం ప్రాంతానికి వచ్చే కొందరు పర్యాటకులు పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పర్యాటక ప్రదేశాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.

పర్యాటక ప్రదేశాల్లో వ్యర్థాలు

పర్యాటకంగా మారేడుమిల్లి ప్రాంతం అభివృద్ధి చెందుతూ వస్తుంది. నిత్యం ఇక్కడకు వేలాది సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ఈ ప్రాంతంలో పర్యాటక ప్రాంతాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగంగా అటవీశాఖ, ఐటీడీఏ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పర్యాటక ప్రదేశమైన మారేడుమిల్లి నుంచి చింతూరు వెళ్లే ప్రధాన రహదారి మీదుగా అటవీ ప్రాంతంలో చెత్త తొట్టెలను ఏర్పాటు చేశారు. కాని ఇక్కడకు వచ్చే సందర్శకులు చాలా వరకు తమ వెంట తెచ్చుకున్న ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు ఇతర వ్యర్థాలు పర్యాటక ప్రదేశాల్లో ఎక్కడిపడితే అక్కడే పారేస్తున్నారు. ఈ కారణంగా పర్యాటక ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఫలితంగా సందర్శకులతో పాటు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

మారేడుమిల్లిలో బెంబో చికెన్‌కి ప్రసిద్ధి. ఇక్కడకు వచ్చిన పర్యాటకులు బెంబో చికెన్‌ను అరగించిన అనంతరం బెంబో గొట్టాలు ప్లాస్టిక్ వ్యర్థాలను అక్కడే వదిలేస్తున్నారు. పర్యాటక ప్రదేశాలో చెత్త తొట్టెలు ఏర్పాటు చేసినా ఉపయోగించకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. చెత్తా చెదారం, వ్యర్థాలు తొట్టెలో వేయాలని అవగాహన బోర్డులు ఏర్పాడు చేసినా పర్యాటకులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు.పర్యాటక ప్రదేశాల్లో ప్లాస్టిక్ నిషేధం ఉన్నప్పటికీ వాటిని ఎవరూ కూడా పాటించడం లేదని పలువురు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు వల్ల తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని, ఇప్పటికేనా పర్యాటక ప్రదేశాల్లో పరిసరాలు పరిశుభ్రత పట్ల పర్యాటకులు శ్రద్ధ చూపాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

మాకవరపాలెం : ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒక వ్యక్తి గాయపడ్డాడు. మండలం పైడిపాలకు చెందిన రెడ్డి అప్పలనాయుడు(48) సోమవారం సాయంత్రం మోటారు సైకిల్‌పై నర్సీపట్నం వైపు నుంచి స్వగ్రామం వస్తున్నాడు. కొండలఅగ్రహారం వద్ద సర్వానది వంతెన మలుపు వద్దకు వచ్చే సరికి ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడ్డాడు. దీంతో అప్పలనాయుడు అపస్మారక స్థితిలో పడి ఉండడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

మారేడుమిల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న తెలుగు, ఇంగ్లిష్, బోటనీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, జువాలజీ, సబ్జెక్టుల బోధనలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పిన్సిపాల్ వి.ఈశ్వర ప్రసాద్ సోమవారం తెలిపారు. అసక్తిగల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈ నెల 7వ తేదీన ఉదయం పది గంటలకు కళాశాలలో జరిగే డెమోకు క్లాసుకు హాజరు కావాలని కోరారు.

1,500 లీటర్ల సారా పులుపు ధ్వంసం

కొయ్యూరు : కొయ్యూరు కొత్త ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన రాజారావు సారా బట్టీలపై దాడులను ఉధృతం చేస్తున్నారు. సోమవారం సిబ్బందితో కలిసి రాజేంద్రపాలెం పంచాయతీ సూరేంద్రపాలెం శివారు ప్రాంతంలో సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. దాచి ఉంచిన 1,500 లీటర్ల సారా పులుపును ధ్వంసం చేశారు. సారా తయారీకి వాడుతున్న ప్లాస్టిక్ డ్రమ్‌లను, ఇతర సామగ్రిని తగులబెట్టారు. ఎవరు సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు కఠినంగా ఉంటాయని ఎస్ఐ రాజారావు హెచ్చరించారు.



సారా తయారీ సామగ్రిని తగులబెడుతున్న పోలీసులు

చీటీల వ్యాపారి కుటుంబం అదృశ్యంపై కేసు నమోదు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో ఫైనాన్స్ చీటీల సొమ్ము కోసం వత్తిడి పెరడగంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తల్లి, పిల్లలు కనిపించకుండా పోవడంపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఆదినారాయణరెడ్డి తెలిపారు. తాళ్లపాలెంలో కుటుంబంతో నివాసం ఉంటున్న దొడ్డా మాధవి భర్త మృతి చెందడంతో ఫైనాన్స్ చీటీలు వసూలు చేసి వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తుండేది. కుమారుడు సుదర్శన చక్రధరరావు, కుమార్తెలు లక్ష్మీనరసింహరాజేశ్వరి, పరమేశ్వరి భవాని అనకాపల్లిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేసి తల్లికి చేదోడుగా ఉండేవారు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల చీటీలు కట్టిన వారికి తిరిగి నగదు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో చీటీలు కట్టిన వారి నుంచి వత్తిడి అధికమైంది. ఈ నేపథ్యంలో మాధవి సహా కుటుంబ సభ్యులు నలుగురు గత నెల 23 నుంచి కనిపించలేదు. ఈ మేరకు మాధవి సోదరుని భార్య వెంకట వసంత శ్రీలక్ష్మివాణి ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

● ఆకాశం.. వర్ణ శోభితం



వంజంగి హిల్స్ ప్రాంతంలో ఆకాశంలో పసుపు రంగు మేఘాలు

పాడేరులోని పర్యాటక ప్రాంతం వంజంగి హిల్స్ వద్ద ఆకాశంలో పసుపు మేఘాలు సోమవారం సాయంత్రం పర్యాటకులు, స్థానికులను కనువిందు చేశాయి. రాజవొమ్మంగి పరిసరాల్లో ఆకాశం పసుపు వర్ణంలో దర్శనమిచ్చింది.

సాక్షి, పాడేరు/రాజవొమ్మంగి:



బడదనాంపల్లి అడవుల్లో కనువిందు చేసిన రంగురంగుల ఆకాశం

వరద బాధితులకు వితరణ

చింతూరు: ఉపాధ్యాయ దినోత్సవం రోజున విశ్రాంత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు వరద బాధితులకు అండగా నిలిచారు. ఇటీవల వరదలకు సర్వం కోల్పోయిన చింతూరులోని శబరిఒడ్డుకు చెందిన 250 కుటుంబాలకు వారు సోమవారం నిత్యావసర సరకులతో పాటు దుప్పట్లు, వంటపాత్రలు వితరణగా అందచేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలసి వరద బాధితులకు సాయం చేసేందుకు మూడు లక్షల రూపాయల విలువైన సామగ్రిని సేకరించారు. వీరికి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా బూడిదంపాడుకు చెందిన రైతులు 25 క్వింటాళ్ల బియ్యాన్ని అందించి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ మేరకు సేకరించిన వస్తువులను తహసీల్దార్ సాయికృష్ణ, పూర్వ ఉపాధ్యాయులు అంకుప్రసాద్ చేతుల మీదుగా బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సాయికృష్ణ మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ఆపన్నహస్తం అందించడం ఎంతో శుభపరిణామమని, బాధితులకు ఇది ఎంతో అండగా ఉంటుందన్నారు. పూర్వ ఉపాధ్యాయుడు అంకుప్రసాద్ మాట్లాడుతూ తన వద్ద విద్య నభ్యసించిన పూర్వ విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం హర్షణీయమని, ఇలాంటి కార్యక్రమాలు ఇతరులు కూడా చేపట్టేందుకు ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయురాలు కమలాదేవి, పూర్వ విద్యార్థులు షహెన్‌షా, ఆశీర్వాదం, మేరీ, ఆసిఫ్, మణి, మూర్తి, ఫయాజ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు వస్తువులు అందచేస్తున్న తహసీల్దార్ సాయికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

చేతబడి నెపంతో గిరిజన మహిళ హత్య

దేవీపట్నం : చేతబడి చేసిందనే నెపంతో ఒక గిరిజన మహిళను కల్లుగీత కత్తితో ఒక యువకుడు పీక కోసి హత్య చేసిన ఘటన డి.ఎస్.పాలెం గ్రామంలో జరిగింది. దేవీపట్నం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డి.ఎస్.పాలెం గ్రామంలో కుండ్ల సోమాలమ్మ (56) అనే గిరిజన మహిళను ఆదివారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన చిడుగూరి శ్రీనివాసరెడ్డి అను యువకుడు తన తల్లికి చేతబడి చేసిందనే అనుమానంతో కల్లు గీత కత్తితో పీక కోసి హత్యకు పాల్పడ్డాడు. శ్రీనివాసరెడ్డి తల్లి గత మే నెలలో పనస చెట్టు పై నుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అప్పటినుంచి ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో శ్రీనివాసరెడ్డి తన తల్లికి సోమాలమ్మ చేతబడి చేసిందని ప్రచారం చేసేవాడు. అతని తల్లి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన సోమాలమ్మను ఇంటికి వెళ్లిన తర్వాత కల్లు గీత కత్తితో పీక కోసి హత్య చేసాడు. విషయం తెలుసుకున్న దేవీపట్నం ఎస్ఐ నాగార్జున మృతదేహాన్ని సోమవారం రంపచోడవరం పోస్టుమార్టం నిమిత్తం తరలించి బంధువులకు అప్పగించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



రక్తపు మడుగులో సోమాలమ్మ మృతదేహం

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

- అనకాపల్లి ఏడీ రామారావు హెచ్చరిక

దేవరాపల్లి : ఎరువులను ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే సదరు లైసెన్స్ రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని అనకాపల్లి ఏడీ ఎం.రామారావు అన్నారు. దేవరాపల్లిలో రిటైల్ ఎరువులు దుకాణాలతో పాటు కోఆపరేటివ్ సొసైటీలలోని ఎరువుల గోదాంలను స్థానిక ఏవో వై.కాంతమ్మతో కలిసి సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎరువుల దుకాణాల లైసెన్స్ గడువు, అమ్మకాలను సమగ్రంగా తనిఖీ చేశారు. గోదాంలో ఎరువులను పరిశీలించారు. ప్రతి దుకాణం ఎదుట ధరల పట్టికను ఏర్పాటు చేసి విధిగా ధరలు నమోదు చేయాలని దుకాణాల యజమానులకు సూచించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



దేవరాపల్లిలో ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీ రామారావు, ఏవో కాంతమ్మ

టూరిజం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, సభ్యులకు వినతిపత్రం అందజేస్తున్న టూరిజం గిరిజన కార్మికులు

- ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబుకు వినతి

సాక్షి, పాడేరు : జిల్లాలోని ఏపీ టూరిజం కార్పొరేషన్‌లో ఆరు యూనిట్లలో పనిచేస్తున్న గిరిజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నేతలు సోమవారం ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు, సభ్యులు జంపరంగి లిల్లీ, కొర్ర రామలక్ష్మి, చిచ్చడి మురళికి వినతిపత్రం అందజేశారు. విజయవాడలోని ఎస్టీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్, ఇతర సభ్యులను వీరు కలిశారు. 25 సంవత్సరాలుగా టూరిజం శాఖలో పనిచేస్తున్న గిరిజన కార్మికులకు అన్ని అర్హతలున్నప్పటికీ ఉద్యోగ భద్రత, పదోన్నతులు, సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని వారు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు టూరిజం ప్రత్యేక డివిజన్ ఇవ్వాలని, గిరిజన ప్రాంతాల్లో ఆరు యూనిట్లలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను గిరిజనులతోనే భర్తీ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి తగిన న్యాయం చేస్తామని ఎస్టీ కమిషన్ చైర్మన్ హామీ ఇచ్చినట్టు టూరిజం కార్మికులు తెలిపారు.

క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న ఎంపీపీ ఆనందరావు

వై.రామవరం: చింతలపూడి గ్రామ సచివాలయాన్ని ఎంపీపీ కడబాల ఆనందరావు సోమవారం సందర్శించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. కుల, జనన, ఆదాయ తదితర ధ్రువపత్రాలు నిర్ణీత సమయంలో మంజూరు చేయాలని, ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. వైస్ ఎంపీపీ జోగిరెడ్డి, గ్రామ సర్పంచ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి



తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, బాధితుడు

అరకులోయ రూరల్: పాతపోస్టాఫీసు పరిధిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడు చిరంజీవి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ తహసీల్దార్ వేణుగోపాల్‌కు వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పిడుగుపాటుకు షార్ట్‌సర్క్యూట్ కారణంగా బాధితుడి ఇంట్లో సామగ్రి పూర్తిగా దగ్ధమైందని, సుమారు రూ.3లక్షల ఆస్తినష్టం జరిగిందని వినతిలో పేర్కొనానరు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, పీసీసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి శ్రీను, నాయకుడు నర్సింగ్ తదితరులున్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



పత్రాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ నర్సమ్మ, చిత్రంలో వైస్ ఎంపీపీ భాగ్యవతి

ముంచంగిపుట్టు: రంగబయలు, వనుగుమ్మ పంచాయతీల్లో పట్టాలు మార్పిడి కార్యక్రమాన్ని తహసీల్దార్ నర్సమ్మ సోమవారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ భాగ్యవతి మాట్లాడుతూ పట్టాల మార్పిడి కాకపోవడంతో పలు పథకాలకు గ్రామస్తులు దూరమవుతున్నారని, సమస్య పరిష్కారానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. సచివాలయాల ద్వారా రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సర్పంచ్ మిల్కి, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న పాడేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గాయత్రి

జి.మాడుగుల: స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని పాడేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మత్స్యరాస గాయత్రి, ఎంపీటీసీ సభ్యురాలు ఎం.విజయకుమారి సోమవారం సందర్శించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలన్నారు.ఈ సందర్భంగా కేంద్రంలో పోషక విలువలు గల పిండి వంటలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు ప్రదర్శనగా ఉంచారు. వారు మాట్లాడుతూ విరివిగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, కందులు తదితర పోషక విలువలున్న ఆహార పదార్థాలు వినియోగించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ చంద్రమణి, మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేతల పరామర్శ

చింతూరు: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుయిగూరుకు చెందిన కారం సంధ్య కుటుంబాన్ని సీపీఎం నేతలు మధు, సీతారాం సోమవారం పరామర్శించారు. వారు మాట్లాడుతూ వరద ముంపు ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు కిరణ్, వెంకట్, సురేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- గురువులకు ఘన సన్మానం



పెదబయలు సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంఈవో సింహాచలం



కొసంగుడలో పాల్గొన్న హెచ్‌ఎం తదితరులు



వై.బి.గొందూరులో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం మత్స్యరాజు, విద్యార్థులు



రాజవొమ్మంగి కళాశాలలో మొక్కలు నాటుతున్న కానిస్టేబుల్ సూరిబాబు, ప్రిన్సిపాల్ మోహన్



ఏకలవ్య ప్రిన్సిపాల్‌కు స్వీట్లు అందజేస్తున్న నేత బాబి

సాక్షి,పాడేరు : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రారంభించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు ఆర్.గోపాలకృష్ణ, సూరజ్ గనోరే, రామశేషులు పలుచోట్ల ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గురువులు సమాజానికి మార్గదర్శకులుగా అభివర్ణించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. సమాజ అభ్యున్నతికి ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఘనంగా సన్మానించారు.

పెదబయలులో..ఎంఈవో సింహాచలం, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో.. హెచ్‌ఎంలు మల్లీశ్వరి, భాస్కరరావు, టీచర్లు పాల్గొన్నారు.

అరకులోయ/అరకులోయ రూరల్‌లో..డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్లు భరత్‌కుమార్, రామకృష్ణ, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం కెందు తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడలో.. హెచ్‌ఎంలు కోగేశ్వరరావు, విలియం కేరీ, సర్పంచ్ నాగేశ్వరరావు, వైఎస్సార్‌టీఎఫ్ ప్రతినిధి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగులలో..మండల పరిషత్ పాఠశాల హెచ్‌ఎం మత్స్యరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరులో.. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ మోహన్ తదితరులున్నారు.

సీలేరులో.. దారకొండ, దుప్పులవాడ, సీలేరు, గుమ్మిరేవుల పంచాయతీల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిపారు.

చింతపల్లిలో.. ఉపాధ్యాయులను సన్మానించారు. గిరి, వెంకటరమణ, మత్స్యలింగం పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో.. కానిస్టేబుల్ సూరిబాబు స్థానిక గురుకుల కళాశాలకు మొక్కలను అందజేశారు. ప్రిన్సిపాల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గంగవరంలో.. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబిరత్నం, హెచ్‌ఎంలు అప్పారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగలలో.. కాంగ్రెస్ పార్టీ నాయకుడు సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎటపాకలో...ప్రిన్సిపాల్ వెంకట్, టీచర్లు పాల్గొన్నారు.

వై.రామవరంలో..పి.యర్రగొండ ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూనవరంలో.. చినార్కురు పంచాయతీ సర్పంచ్ సున్నం అభిరామ్ జన్మదినం సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమంలో తెల్లవారిగుంపు, జన్నెలగూడెం, పంద్‌రాజుపల్లి, వెంకన్నగూడెం పాఠశాలల్లో సుమారు 220 విద్యార్థులకు పులిహోర, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.

వీఆర్ పురంలో.. జెడ్పీ పాఠశాల ప్రిన్సిపాల్ రామలక్ష్మి, కరస్పాండెంట్ సాదత్ తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లిలో..ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలసలోని వేడుకలో పాల్గొన టీచర్లు



పి.యర్రగొండ పాఠశాలలో గురుపూజోత్సవ కార్యక్రమం



అరకులోయ డిగ్రీ కాలేజీలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు



కూనవరంలో విద్యార్థులకు పెన్నులు అందజేస్తున్న సర్పంచ్ అభిరామ్



ఎటపాకలో ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



అరకులోయలోని వేడుకలో పాల్గొన్న ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు



చింతపల్లిలో రిటైర్డ్ టీచర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



గంగవరంలోని వేడుకలో పాల్గొన్న ఎంపీపీ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు



వీఆర్ పురంలో విశ్రాంత ఉపాధ్యాయుడు సీతారామ్‌ను సన్మానిస్తున్న దృశ్యం



ప్రిన్సిపాల్ వేషధారణలో రికార్డులు పరిశీలిస్తున్న విద్యార్థిని

గిరిజనుల అభ్యున్నతే లక్ష్యం

- అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



రంగశీలలో గిరిజనులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: గిరిజను అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రంగశీల పంచాయతీ కేంద్రంతో పాటు, ఒంటిపాక గ్రామాల్లో వారు సోమవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో వారికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో 279 గడపలను వారు పర్యటించారు.ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో తాగునీరు, రోడ్ల సమస్యలు పరిష్కరించామని, మరికొన్ని చోట్లు పనులు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా జగనన్న ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం, వైస్ ఎంపీపీ ప్రియాంక, వైఎస్సార్ సీపీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొండలరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు విశ్వేశ్వరరావు, యువజన విభాగ ప్రధాన కార్యదర్శి దిలీప్, ఎంపీటీసీ సభ్యులు సుశీల, రజిని, నాగరాజు, సర్పంచ్‌లు సాంబ, బొంజుబాబు, ఈశ్వరమ్మ, సత్యవతి, పుష్పలమ్మ, దేవుడమ్మ, మాజీ ఎంపీపీ రవిప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు కొండబాబు, నాయకులు చిన్నబ్బి, ధర్మయ్యదొర తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



దుంబ్రిగుడ ఆర్‌బీకేలో రాజ్‌మా విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, సీఐ దేముడుబాబు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో గిరిజన రైతులకు రాయితీపై రాజ్‌మా విత్తనాలను ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ, అరకులోయ సీఐ జి.దేముడు బాబు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన రైతులకు అండగా నిలుస్తోందని, ప్రభుత్వ ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ ఆనంద్‌రావు, సర్పంచ్ వెంకటరావు, ఉప సర్పంచ్ జగ్గనాయుడు, నాయకులు సింహాచలం, శ్రీరాములు, కృష్ణారావు, ఎస్ఐ సంతోష్‌కుమార్, ఏవో నీలవేణి, నాయకులు గణపతి, మల్లేష్, మొద్నో తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: వంచుల, జర్రెల ఆర్‌బీకేల్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి తదితరులు రైతులకు రాయితీపై రాజ్‌మా విత్తనాలు అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, సర్పంచులు కాసులమ్మ, నాగరాజు, ఎంపీటీసీ సరస్వతి, సీఐ అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నేత బాలకృష్ణ, రాజు పాల్గొన్నారు.

గురువులకు సత్కారం



కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న ఎంఈవోలు రామచంద్రరావు , మల్లేశ్వరరావు, విద్యాశాఖ కో-ఆర్డినేటర్ జయరాజ్

హుకుంపేట/గంగవరం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాడేరులో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఇందులో భాగంగా హుకుంపేట ఎంఈవో ఎస్.రామచంద్రరావు, గంగవరం ఎంఈవో వై.మల్లేశ్వరరావులకు ఉత్తమ ఎంఈవోలుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారికి పలువురు అభినందనలు తెలిపారు. వీరితో పాటు హుకుంపేట మండల విద్యా శాఖ కో-ఆర్డినేటర్ జయరాజ్ కూడా అవార్డుల అందుకున్నారు.

చెత్తను విధిగా తొలగించాలి

కొయ్యూరు: ఎంపీడీవో మేరీరోజ్ సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీల్లో చెత్తను విధిగా తొలగించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. ప్రతి పంచాయతీకి అందజేసిన రిక్షాల ద్వారా చెత్తను గ్రామానికి దూరంగా తరలించాలని సూచించారు. ఈవోపీఆర్‌డీ పైడినాయుడు, ఏవో బాలమురళీకృష్ణ పాల్గొన్నారు

వాహనాల తనిఖీ

చింతపల్లి: మండల కేంద్రంలో ఎస్ఐ మహమ్మద్ షరీఫ్ ఆలీ ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీ చేపట్టారు. ఓ విద్యార్థి బైక్‌పై అతివేగంగా వెళ్తుండగా ఎస్ఐ పట్టుకొని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేస్తామన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

గూడెంకొత్తవీధి : పిల్లిగొంది గ్రామంలో పెదవలస వైద్యాధికారి డాక్టర్ కోమలి ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శిబిరంలో 72 మందికి వైద్య పరీక్షలు చేశామని, మందులు అందజేశామన్నారు. శ్రీనివాస్, మంగలక్ష్మి తదితరులున్నారు.

కసుమరాయిలో 104 సేవలు

గంగవరం : గ్రామాల్లో 104 వైద్య సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పాయం రాజులమ్మ అన్నారు. కుసుమరాయి గ్రామంలో 104 వైద్య సిబ్బంది సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధర్మరాజు ఆధ్వర్యంలో 98 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సిబ్బంది సాయి, రమేష్, మధు, సతీష్, ఏఎన్‌ఎం కె. సుబలక్ష్మి,ఆశా మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయల్లో దరఖాస్తులు స్వీకరించాలని వినతి

కూనవరం : పోడు భూములకు సంబంధించిన దరఖాస్తులను స్థానిక సచివాలయాల్లోనే స్వీకరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.నాగేశ్వరరావు, పెంటయ్య, బాబురావు, తదితరులున్నారు.

నిర్వాసితులను ఆదుకోవాలి

వీఆర్ పురం: చొక్కనపల్లి గ్రామంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి పునరావాసం కల్పించే వరకు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులు నిలిపివేయాలన్నారు. వరద బాధితులను ఆదుకోవాలన్నారు. సీతారామ్, కిరణ్, సత్యనారాయణ,ఎంపీపీ లక్ష్మి ,ఎంపీటీసీ ప్రదీప్, సర్పంచ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనం



సాక్షి, పాడేరు/ముంచంగిపుట్టు/గంగవరం/మారేడుమిల్లి: వినాయక చవితి వేడుకల్లో భాగంగా పాడేరులోని సినిమాహాల్ సెంటర్, ముంచంగిపుట్టులోని జీసీసీ గొదాము ప్రాంతాల్లో గణనాథుని విగ్రహాల నిమజ్జనం ఘనంగా జరిగింది. థింసా నృత్యాలు, శక్తి వేషాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు సాగింది. చిలకలమామిడి, మత్స్యగెడ్డలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. గంగవరం, మారేడుమిల్లిలో భారీ అన్న సమారాధన జరిగింది.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వెదుళ్లకొండలో మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

అడ్డతీగల: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో ఇంటింటా వెలుగు వచ్చిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. అడ్డతీగల మండలం రాయపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని వంగలమడుగు, వెదుళ్లకొండ గ్రామాల్లో ఎమ్మెల్యే ధనలక్ష్మి సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందజేయడంతో పాటు గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి ముందుగా వంగలమడుగులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వంటషెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ధనలక్ష్మి భూమిపూజ చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫాం క్లాత్‌ను పంపిణీ చేశారు. రాయపల్లి ఎంపీటీసీ మడకం సత్యనారాయణదొర, సర్పంచ్ విశ్వనాథం, వైఎస్సార్ సీపీ నాయకుడు బత్తుల సత్యనారాయణ, నక్కా మోహన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అనంతగిరి: కొనపురం పంచాయతీ సారగూడ జీపీఎస్‌టీడబ్ల్యూ పాఠశాలలో చేపట్టునున్న అభివృద్ధి పనులకు సర్పంచ్ అప్పలమ్మ సోమవారం శంకుస్థాపన చేశారు. విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్‌లను అందజేశారు. జగన్నాథం, మీనా, మధు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: భీంపోల్ పంచాయతీ సీతపాడు గ్రామంలోని నాడు-నేడులో 14లక్షలతో మంజూరైన అంగన్‌వాడీ భవనానికి సర్పంచ్ భీమ్మలమ్మ సోమవారం శంకుస్థాపన చేశారు. సూపర్‌వైజర్ రామయమ్మ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: సొలభం పంచాయతీ ఎస్.పెదబయలు గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులను సోమవారం సర్పంచ్ ఐసరం హనుమంతరావు ప్రారంభించారు. హెచ్‌ఎం శ్యాంసుందరం, వైఎస్సార్‌సీపీ నాయకుడు మత్స్యకొండబాబు తదితరలు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: మల్లవరం పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య సోమవారం శంకుస్థాపన చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈవో ప్రసాద్, సర్పంచ్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మారేడుమిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సార్ల లలితకుమారి అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ లోతట్టు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రహదారుల నిర్మాణాలు చేపట్టాలని, ప్రజా సమస్యల తక్షణమే పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పీహెచ్‌సీలో వైద్యుల కొరత, రైతుల సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కిసాన్ పథకం కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో వెంకటేశ్వరరావు చెప్పారు. జెడ్పీటీసీ బాలాజీబాబు, వైస్ ఎంపీపీ రవికుమార్, ఎంపీడీవో వివేక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామ సచివాలయం ప్రారంభం

గూడెంకొత్తవీధి : దేవరాపల్లి గ్రామ సచివాలయాన్ని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మంగళవారం ప్రారంభిస్తున్నట్టు ఎంపీపీ బోయిన కుమారి,మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో సీసీలు, వీఓఏలతో ఏపీఎం ఆదినారాయణ సోమవారం సమావేశం నిర్వహించారు. డ్వాక్రా సంఘాలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కోళ్లు, మేకలు, గొర్రెల యూనిట్లను అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

కొయ్యూరు: మావోయిస్టులకు వ్యతిరేకంగా అల్లూరి ఆదివాసి యువజన సంఘం పేరిట కరపత్రాలు కొయ్యూరు పరిశర ప్రాంతాల్లో సోమవారం దర్శనమిచ్చాయి. గిరిజనులకు మావోయిస్టులు చేసిన మోసాలు.. పోలీసులు చేపట్టిన సేవా కార్యక్రమాలను పోస్టర్‌లో ప్రచురించారు.

సాక్షి ఫ్యామిలీ
విశాఖపట్నం
మంగళవారం ॥ 6-9-2022



స్వాతి పాల

'నేను ఒక సగటు భారతీయ మహిళకు ప్రాతినిధ్యం వహిస్తున్నాను. పెళ్లయ్యి, పిల్లలున్న నాకు అందాల సుందరిగా పట్టాభిషేకం చేయడం భారతదేశం నలుమూలలల్లో ఉన్న అద్భుతమైన మహిళలకు స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను' అని చెప్పారు స్వాతి పాల.

ఈ యేదాది హాట్ మండే మిసెస్ ఇండియా వరల్డ్ వైడ్ 2022 విజేత కిరీటాన్ని ఇటీవల స్వాతి పాల అందుకున్నారు. విశాఖపట్టణంలో పుట్టి పెరిగిన స్వాతి, హైదరాబాద్‌లో మీడియా రంగంలోనూ పని చేశారు. కెనడాలో బిజినెస్ అనలిస్ట్‌గా, ఇద్దరు పిల్లలు తల్లిగా, కుటుంబాన్ని సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న గృహిణిగా, తన కలలను సాకారం చేసుకోవడానికి కృషి చేస్తున్న సాధకురాలిగా స్వాతి ఎన్నో సంగతులను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

సాధనతోనే కీర్తికిరీటం

''ఈ ఏడాది ప్రయాణం నాకు చాలా అపురూపమైనది. వివాహిత మహిళల కోసం అత్యంత గౌరవనీయమైన, ప్రసిద్ధి చెందిన ఈ అందాల పోటీలు దుబాయ్‌లోని రస్ అల్ ఖైమాలోని హిల్టన్ గార్డెన్ ఇన్ లో జరిగింది. ఈ ఫైనల్స్‌లో దేశ దేశాల నుంచి 20 మంది మహిళలు పాల్గొన్నారు. అందులో నేను అగ్రగామిగా నిలవడం ఎంతో గొప్పగా, ఆనందంగా అనిపించింది. నీరు, అగ్ని, గాలి, అంతరిక్షం, భూమిని సూచించేలా నన్ను ఎలిమెంట్స్ క్వీన్‌గా ప్రకటించారు.

మాది వైజాగ్. అక్కడే ఆంధ్రా యూనివర్శిటీలో ఎంబీయే చేశాను. హైదరాబాద్‌కి ఉద్యోగరీత్యా వచ్చాక సాక్షి' టీవీ ప్రారంభం నుంచి నాలుగేళ్లు హెచ్.ఆర్ విభాగంలోనూ, క్రియేటివ్ ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్‌గానూ వర్క్ చేశాను. మా వారి జాబ్ నేవీ కావడంతో తనకు కెనడాకు ట్రాన్స్‌ఫర్ అయ్యింది. దీంతో నేనూ కెనడా వెళ్లాను. అక్కడే బిజినెస్ అనలిస్ట్‌గా వర్క్ చేస్తున్నాను.

ఆన్‌లైన్‌లో అప్లై

మా వారు ఆన్‌లైన్‌లో ఈ అందాల పోటీల గురించి చూసి, నన్ను ప్రోత్సహించారు. అప్లై చేయించారు. 50 వేల అప్లికేషన్స్‌లో 110 మందిని ఎంపిక చేశారు. అలా ఎంపిక అయిన వారిలో నేనున్నాను. అప్లై చేసిన దగ్గర నుంచి ఏడాదిగా చాలా సెషన్స్ అయ్యాయి. వాటిలో రకరకాల టాస్క్‌లు దాటుకుని దుబాయ్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలే వరకు వచ్చాను. మూడు రోజుల పాటు వివిధ దేశాల నుంచి వచ్చిన 20 మందితో పోటీ పడి ఈ కార్యక్రమంలో విజేతగా నిలిచాను.





మిసెస్ ఇండియా వరల్డ్ వైడ్ 2022 కిరీటాన్ని అందుకుంటున్న సమయంలో..

కష్టమైనా ఇష్టంతో..

ఓ వైపు ఉద్యోగం చేస్తూ మరోవైపు ఈ పోటీలో పాల్గొడానికి చేసిన కృషి చాలా కష్టమైనది. రోజూ జిమ్‌కి వెళ్లడం, సరైన పోషకాహారం తీసుకోవడం, గ్రూమింగ్ సెషన్స్ తీసుకోవడం, ర్యాంప్ వాక్, వెయిట్ మేనేజ్‌మెంట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోసం క్లాసులు .. ప్రతిసారీ టాస్క్ అనిపించింది. ఉద్యోగంతో పాటు ఈ హార్డ్ వర్క్ చేయగలనా.. అని సందేహం కలిగింది. కానీ, ప్రారంభించాక మెల్ల మెల్లగా మామూలు అయిపోయింది. అయితే, ఈ క్లాసులన్నీ దాదాపు ఆన్‌లైన్‌లోనే తీసుకున్నాను. ఇండియా నుంచి కోచ్‌లుగా ఉన్న రితిక రామ్‌త్రీ మొదటి ఆరు నెలలు, తర్వాత శైలజ సూచి దగ్గర ట్రెనింగ్ తీసుకున్నాను. ఇండియా టైమింగ్స్‌ను బట్టి నైట్ టైమ్‌లోనూ కోచింగ్ తీసుకున్నాను. ప్రతిరోజూ ఏదో కొత్తది నేర్చుకుంటున్నాను అనే ఉత్సాహంతో ఈ ప్రయాణం నడిచింది.

క్లాసికల్ డ్యాన్సర్

ముందు కష్టం అనుకున్నది మెల్లగా మెల్లగా నా దినచర్య మార్చుకోవడంతో ట్రెనింగ్ సులువుగా మారిపోయింది. సెషన్స్‌లో 'మిమ్మల్నే మిసెస్ ఇండియాగా ఎందుకు సెలక్ట్ చేయాలి?' అనే ప్రశ్న వచ్చినప్పుడు చాలామంది మహిళలకు స్ఫూర్తిగా ఉండాలనుకున్నాను. చిన్నప్పుడు శాస్త్రీయ నృత్యంలోనూ శిక్షణ తీసుకున్నాను. దీంతో డ్యాన్స్‌లో నాకు సులువు అనిపించింది.

పిల్లలే ప్రోత్సాహం


కిరీటం వచ్చిందా లేదా అనేది తర్వాతి విషయం. శిక్షణ ఎంత బాగా తీసుకుంటామో ఫైనల్ పోటీలలో ప్రతిఫలిస్తుంది. కానీ, నాలో నాకే చాలా గొప్ప మార్పులు కనిపించాయి. నా పెద్ద కొడుకు తనీష్‌కి పదకొండేళ్లు. వాడు నా ఫొటోలు తీసి, సోషల్ మీడియా పేజీలో అప్‌లోడ్ చేసేవాడు. చిన్నవాడు రేయాన్ ఫుడ్ తీసుకోవడంలో చాలా బాగా ఎంకరేజ్ చేసేవాడు. 'నువ్వే గెలవాలి' అనే వారి తాపత్రయం నాకు మరింత ప్రోత్సాహాన్నిచ్చింది.

రాబోయే పోటీలు

12వ సీజన్ స్టార్ట్ కాబోతోంది. కెనడాలో వచ్చే నెలలో జరగబోయే ఆడిషన్స్‌లో నేను జ్యూరీ మెంబర్‌గా ఉన్నాను. అయితే, ఫైనల్స్ ఎక్కడ జరుగుతాయో తెలియాల్సి ఉంది' అని వివరించారు ఈ మిసెస్ ఇండియా.

– నిర్మలారెడ్డి

"జీవితంలో నాకు కావాల్సిన సంతోషాలన్నీ దొరికాయి. అది లేదు, ఇది లేదు అన్న అసంతృప్తిలేదు. కానీ ఇంతవరకు నా కాళ్ల మీద నేను నిలబడదానికి ప్రయత్నించిదిలేదు. సొంతంగా డబ్బులు సంపాదించలేదు" అని చాలా మంది మలివయసులో దిగులు పడుతుంటారు. అచ్చం ఇలాంటి ఆలోచనా ధోరణి ఉన్న తొంభై ఏళ్ల హర్భజన్ కౌర్ తన మనసులో బాధను దిగమింగుకుని, ఈ జన్మకు ఇంతేలే అని సరిపెట్టుకోలేదు. "వయసు అయిపోతే ఏంటీ నేను ఇప్పుడైనా సంపాదించగలను" అని బర్ఫీలు తయారు చేసి విక్రయిస్తోంది. తొంభైల లోనూ వ్యాపారాన్ని లాభాల బాట పట్టిస్తూ బర్ఫీబామ్మగా ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.



బర్ఫీ బామ్మ

అమృతసర్‌లోని తారన్‌తారన్ ప్రాంతంలో పుట్టిపెరిగింది హర్భజన్ కౌర్. పెళ్లికావడంతో భర్తతో లుధియానాలో కొత్తజీవితం మొదలు పెట్టింది. సంసారం, పిల్లలతో తొంభై ఏళ్లు గడిచిపోయాయి కౌర్ జీవితంలో. పదేళ్లక్రితం భర్త చనిపోవడంతో చండీఘడ్ లోని తన చిన్నకూతురు దగ్గర ఉంటోంది కౌర్. తొంభై ఏళ్ల వయసులో అన్ని బాధ్యతలు నెరవేరినప్పటికీ..తన కాళ్ల మీద తను నిలబడలేదు, సొంతంగా ఒక్క రూపాయి సంపాదించలేదన్న అసంతృప్తి మాత్రం ఆమె మనసులో ఉండిపోయింది. ఓ రోజు మాటల మధ్యలో తన మనసులో మాటను కూతురు దగ్గర చెప్పింది. అప్పుడు.. కూతురు సరే..ఇప్పుడు నువ్వు ఏం చేయాలనుకుంటున్నావు అని అడిగింది. అందుకు కౌర్.. శనగపిండితో బర్ఫీలు చేసి విక్రయించాలనుకుంటున్నాను'' అని చెప్పింది. అందుకు కూతురు సాయం చేయడంతో చండీఘడ్‌లోని సెక్టార్–18లో చిన్న స్టాల్ పెట్టి శనగపిండితో చేసిన బర్ఫీలను విక్రయించింది. ఐదు కేజీల బర్ఫీలు విక్రయించగా మూడు వేల రూపాయలు వచ్చాయి. వ్యాపారం ప్రారంభించిన తొలిరోజే మూడు వేల రూపాయలు రావడంతో ఆమె బర్ఫీల వ్యాపారానికి మరింత ప్రోత్సాహం లభించినట్లు అనిపించింది. ఇదే సమయంలో హర్భజన్ బర్ఫీ తయారు చేస్తోన్న వీడియోను ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా ట్విటర్‌లో షేర్ చేయడంతో వీడియో బాగా వైరల్ అయ్యింది. ఈ వీడియో ద్వారా వచ్చిన పాపులారిటీతో బర్ఫీల ఆర్డర్లు విరివిగా పెరిగి వ్యాపారం చక్కగా సాగుతోంది.



నాన్న నుంచి నేర్చుకుని..

హర్భజన్ తండ్రికి వంటబాగా చేసేవారు. ఆయన నుంచి వంట నైపుణ్యాలను చక్కగా అవపోసన పట్టిన కౌర్... శనగపిండి బర్ఫీ, బాదం సిరప్, టొమాటో చట్నీ, నిమ్మకాయ, మామిడికాయ పచ్చడి, దాల్ హల్వా, పిర్నీ, పంజిరి, ఐస్‌క్రీమ్‌లు వంటివి తయారు చేసి విక్రయిస్తోంది. ముందుగా తనకోసం చేసుకుని రుచి చక్కగా కుదిరిన తరువాత మార్కెట్లో విక్రయిస్తోంది. కౌర్ వంటలకు కస్టమర్లనుంచి విరివిగా ఆర్డర్లు వస్తున్నాయి. గత ఆరేళ్లుగా ఒకపక్క బర్ఫీలు చేస్తూనే తనకు ఏమాత్రం ఖాళీసమయం దొరికినా తన మనవ సంతానానికి చిన్నచిన్న గౌన్లను కుడుతుంది. సోషల్ మీడియాలో తన వీడియోలతో వ్యూవర్స్‌ను ఆకట్టుకోవడమేగాక, ఈ వయసులో కృష్ణా రామా అంటూ కూర్చోకుండా తనకు తెలిసిన పనితో సంపాదిస్తూ మలివయసులో ఊసుపోని వారెందరికో ప్రేరణగా నిలుస్తోంది.

మరో తరానికి...

నూటపదేళ్లకుపైగా చరిత్ర ఉన్న శనగపిండి బర్ఫీని విక్రయించడం నాకు చాలా గర్వంగా ఉంది. చిన్నప్పుడు మా నాన్నగారు ఈ బర్ఫీని ఎంతో రుచికరంగా చేసేవారు. అది చూసి నేర్చుకున్న నేను నా పిల్లలు, తరువాత మనవళ్లకు వండిపెట్టాను. బర్ఫీ ప్రతిముక్కలో నా చిన్నతనం నాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తాయి. ఇంట్లో నేను చేసిన బర్ఫీలను అంతా ఇష్టంగా తినేవారు. ఇప్పుడు బయటివాళ్లు సైతం ఇష్టపడుతున్నారు. 'చైల్డ్ హుడ్ మెమొరీస్' పేరిట ఆన్‌లైన్‌లో ఫుడ్ విక్రయిస్తున్నాం. ప్రారంభంలో ఆర్డర్లు తక్కువగా ఉన్నప్పటికీ, ఇప్పుడు బాగా వస్తున్నాయి. నా కూతురు రవీనా సాయంతో నేను ఇదంతా చేయగలుగుతున్నాను. సోషల్ మీడియా అంటే ఏంటో కూడా తెలియని నేను.. నా వీడియోలతో వేలమందిని ఆకట్టుకోవడం సంతోషాన్నిస్తోంది".

– హర్భజన్ కౌర్

సాగుబడి
పుబ్బ కార్తె:
సెప్టెంబర్ 12 వరకు



దేశవాళీ వరి పొలంలో ఘనజీవామృతం చల్లుతున్న రైతు ఘట్‌రాజు వెంకటేశ్వరరావు

అవిశ్రాంత 'దేశీ' రైతు!

ఆయన ఓ విశ్రాంత ఉద్యోగి. నెలకు రూ.3 లక్షలు జీతం. ప్రైవేటు కంపెనీలో డిజిఎంగా పనిచేసి వీఆర్ఎస్ తీసుకున్నారు ఘట్‌రాజు వెంకటేశ్వరరావు. వ్యవసాయంపై ఉన్న ఆసక్తితో అమ్మమ్మ గారి ఊరు కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోలవెన్ను గ్రామానికి వచ్చి తమ 4.5 ఎకరాల పొలంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో దేశీ వరి రకాల సాగు చేపట్టారు. సుమారు రెండేళ్లు నిల్వ చేసిన ధాన్యాన్ని ఆరోగ్యదాయకమైన దేశీ బియ్యం విక్రయిస్తూ లాభాలతో ఆత్మసంతృప్తిని ఆర్జిస్తున్నారు. ఆయన అనుభవాల సారం ఆయన మాటల్లోనే..

''ప్రముఖ కంపెనీలో ముంబైలో ఉద్యోగం చేశాను. డీజీఎంగా బాధ్యతలు నిర్వహణ. ఐదేళ్ల క్రితం వీఆర్ఎస్ తీసుకుని హైదరాబాద్‌కు వచ్చేశాను. అప్పటికే ప్రకృతి సేద్యంపై ప్రచారం విస్తృతంగా సాగుతోంది. ప్రకతి వ్యవసాయ నిపుణులు సుభాష్ పాలేకర్ శిక్షణా తరగతుల్లో పాల్గొని మెళకువలు నేర్చుకున్నా. ఆచరణలో పెట్టేందుకు అమ్మమ్మ వాళ్ల ఊరైన కోలవెన్ను వచ్చి స్థిరపడ్డా. 4.5 ఎకరాల్లో తులసీబాణం, నారాయణ కామిని, నవారా, కాలాభట్, మార్టూరు సన్నాలు, రత్నచోడి, బహురూపి వంటి దేశీ వరి రకాలు సాగు చేస్తున్నా. రెండు ఆవులను తెచ్చుకున్నా. ఏటా సాగు ఆరంభంలో 40 ట్రక్కుల ఘన జీవామృతాన్ని పొలంలో చల్లుతున్నా. పంటకు అన్ని పోషకాలు సమృద్ధిగా లభిస్తున్నాయి. వర్రలతో బావిని కట్టించి 1200 లీటర్ల జీవామృతం తయారుచేసి 15 రోజులకోసారి చల్లుతున్నా. పంట ఆరోగ్యంగా ఎదుగుతున్నది. తెగుళ్ల బెడద లేదు. ఆవ పిండి చెక్క కూడా జీవామృతంలో కలిపి వాడుతున్నా. ఎకరాకు రూ. 25–30 వేల వరకూ పెట్టుబడి అవుతుంది. 25–28 బస్తాల వరకూ ధాన్యం దిగుబడి వస్తున్నది. పంటను ఆశించే పురుగు నివారణకు వేపపిండి చల్లుతాను. పోషకాలు జీవామతం ద్వారా అందుతాయి. మరీ అవసరం అయితే, అగ్ని అస్త్రం చల్లుతాను. ఎలాంటి పురుగైనా నాశనం అవుతుంది.

దేశవాళీ విత్తన పంట నిల్వ, మార్కెటింగ్ విషయాలు చాలా ప్రధానమైనవి. పంట చేతికి వచ్చాక కనీసం 10 నెలల నుంచి రెండేళ్ల వరకూ పంటను మాగబెట్టిన ధాన్యాన్ని మిల్లులో ఆడించి నాణ్యమైన బియ్యాన్ని బెంగుళూరు, హైదరాబాద్, కొచ్చిన్, చెన్నై ప్రాంతాల్లో ఉన్న నేరుగా విక్రయిస్తున్నా. నవారా, కాలాభట్ స్థానికంగా కిలో రూ. 90కి, బయట ప్రాంతాలకు రూ. 120కే అందిస్తున్నా, రవాణా ఖర్చు కూడా కలిపి. ఇతర రకాల బియ్యం కిలో రూ.75కే ఇస్తున్నా.



వడ్లు ఎంత మాగితే అన్నం అంత ఒదుగుతుంది. ధాన్యం నిల్వ చేయకుండా తినటం వల్ల కడుపు నొప్పి, అజీర్ణ సమస్యలు ఏర్పడతాయి. పంట నాణ్యంగా ఉంటే ఆరోగ్యం వృద్ధి చెందుతుంది. అలాగే ప్రకృతి విధానం వల్ల భూసారం పెంపొందుతుందని గుర్తించాను.

– ఘట్‌రాజు వెంకటేశ్వరరావు
(92255 25562)
కోలవెన్ను



కాలా భట్ బియ్యం

ప్రతి రైతూ ప్రకృతి విధానం వైపు అడుగులు వేస్తే దిగుబడులు, ఆరోగ్యం, ఆదాయం, భూసారం పెంపుదల సాధ్యమే. ప్రభుత్వం రైతు భరోసా, ఇతర సబ్సిడీలు అందిస్తున్నది.


వీటితో పాటు ప్రకృతి విధానంలో పండించిన పంటకు అంతర్జాతీయంగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని మార్కెటింగ్ సదుపాయాలు విస్తరించి, అదనపు వసతులు కల్పిస్తే కొత్త రైతులు కూడా ఈ విధానంలోకి వచ్చేస్తారు.''

– ఈ.శివప్రసాద్, సాక్షి, కంకిపాడు, కృష్ణా జిల్లా

కూరగాయలు, పండ్ల నిల్వలో విప్లవం

లేపనంతో నిశ్చింతగా 2 నెలలు నిల్వ!

- కూరగాయలు, పండ్ల నిల్వ సామర్థ్యాన్ని పెంచే అద్భుత లేపనాన్ని కనుగొన్న గౌహతి ఐఐటీ శాస్త్రవేత్తలు.
- లేపనంతో 2 నెలలు చెక్కు చెదరని బంగాళా దుంపలు, టొమాటోలు, పచ్చి మిర్చి, స్ట్రాబెర్రీలు, నారింజ, ఆపిల్, పైనాపిల్, కివీ పండ్లు.
- రంగు, రూపు, రుచి, పోషకాల సాంద్రత ఏమాత్రం మారలేదు.
- లేపనం సహజమైనది కాబట్టి తినేవారి ఆరోగ్యానికి హానికరం కాదు.
- ఈ లేపన పదార్థాన్ని పూత ద్రావణంగా లేదా కవరుగా తయారుచేసి వాడొచ్చు.



పండ్లు, కూరగాయల నిల్వ పద్ధతిలో విప్లవాత్మక మార్పు వచ్చింది. అస్సాం లోని గౌహతి ఐఐటీ శాస్త్రవేత్తలు ఉద్యాన పంటల రైతులకు తీపిక బురు చెప్పారు. విస్తృత పరిశోధనల ఫలితంగా సముద్రపు నాచు వంటి సహజ పదార్థాలతో ఓ సేంద్రియ లేపన పదార్థాన్ని ఆవిష్కరించారు. ఈ ద్రావణంలో కూరగాయలు, పండ్లను ముంచి తీసి పక్కన పెడితే సరి. లేదంటే ఈ పదార్థంతో కవరును తయారు చేసి అందులో పండ్లు, కూరగాయలను నిల్వ చేసినా చాలు. వారం, రెండు వారాలు కాదు.. ఏకంగా రెండు నెలల వరకు చెక్కు చెదరకుండా నిల్వ ఉంటాయని శాస్త్రవేత్తలు ప్రకటించారు. కుళ్లిపోయిన టమాటోలు, ఉల్లిపాయలు, పండ్లను చెత్తకుప్పల్లో పారబోయాల్సిన దుస్థితికి కాలం చెల్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయనిపిస్తోంది. అంతేకాదు.. 'పచ్చి సరుకు' కాబట్టి తక్కువ ధరకే తెగనమ్ముకోవాల్సిన దుస్థితి నుంచి ఉద్యాన రైతులు విముక్తి పొందే రోజు కూడా దగ్గర్లోనే ఉందని చెప్పొచ్చు!

ఆకృతి, రంగు, రుచి, పోషకాలు చెక్కుచెదరవు!



భారత వ్యవసాయ పరిశోధనా మండలి అంచనా ప్రకారం 5 నుంచి 16 శాతం పండ్లు, కూరగాయలు కోసిన తర్వాత నిల్వ సామర్థ్యం లేక వృథాగా పాడైపోతున్నాయి. వాస్తవానికి ఈ నష్టం బంగాళాదుంప, ఉల్లిపాయలు, టొమాటో వంటి కొన్ని పంటల్లో కోత అనంతర నష్టం 19% వరకు ఉండొచ్చు. ప్రజలు ఎక్కువగా తినే ఈ కూరగాయల ధర ఆ మేరకు పెరిగిపోతోంది. ఈ లేపన పదార్థాన్ని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయడానికి అవకాశాలు ఉన్నాయి. 40 డిగ్రీల సెల్షియస్ వరకు కాంతిని, వేడిని, ఉష్ణోగ్రతను ఈ లేపనం చాలా స్థిరంగా తట్టుకుంటుంది. తిన్న వారి ఆరోగ్యానికి ఎటువంటి హానీ జరగదు. సురక్షితమైనది. లేపనం చేసిన పండ్లు, కూరగాయల ఆకృతి, రంగు, రుచి, పోషక విలువలు చెక్కు చెదరదు. ఈ లేపన పదార్థాన్ని నేరుగా కూరగాయలు, పండ్లపై పూయవచ్చు లేదా ఈ పదార్థంతో కవర్‌ను తయారు చేసి కూరగాయలు, పండ్లను అందులో నిల్వ చేయవచ్చు. ఈ రెండు పద్ధతుల్లో ఎలా ఉపయోగించినా కూరగాయలు, పండ్ల నిల్వ సామర్థ్యాన్ని పొడిగించవచ్చు. ఇది సాధారణ 'డిప్ కోటింగ్ టెక్నిక్'. పెద్దగా ఖర్చు పెట్టకుండానే పంట కోత అనంతరం దిగుబడులను సులభంగా దీర్ఘకాలం నిల్వ చేసుకోవచ్చు.

– ప్రొ. విమల్ కటియార్, అధిపతి, కెమికల్ ఇంజనీరింగ్ విభాగం, ఐఐటి, గౌహతి, vkatiyar@iitg.ac.in

కూరగాయలు, పండ్లను పొలంలో పండించడానికి రకాన్ని బట్టి 3 నుంచి 12 నెలల సమయం పడుతుంది. ఇంతా కష్ట పడి పెంచి చెట్ల నుంచి కోసిన తర్వాత, ప్రజలకు అందించే లోగా, కొద్ది రోజుల్లోనే వడలిపోతుంటాయి. ఇంకొన్ని రోజులైతే కుళ్లి పనికిరాకుండా పోతుంటాయి కూడా. ఈ క్రమంలో ఉద్యాన పంటల రైతులకు, చిరు వ్యాపారులకు తీవ్ర నష్టం జరుగుతూ ఉంటుంది. కొన్ని రకాల కూరగాయలు, పండ్లకైతే అత్యధికంగా 20% వరకు నష్టం జరుగుతోంది. ధర మరీ పతనమైతే పార బోయాల్సిన దుస్థితి. ఈ కష్టాల నుంచి రైతులను, వ్యాపారులను గట్టెక్కించే సరికొత్త సేంద్రియ లేపన పదార్థాన్ని గౌహతిలోని ఐఐటీకి చెందిన రసాయన ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్లు, పరిశోధకులు కనుగొన్నారు.

తాజాదనాన్ని, పోషకాలను, రంగును, రూపురేఖలను కోల్పోకుండా పండ్లు, కూరగాయలను నిల్వ చేయొచ్చు. బంగాళదుంపలు, ఉల్లిపాయలు వంటి వాటిని మెత్తబడిపోకుండా, మొలక రాకుండా చూసుకోవచ్చు. ఏకంగా రెండు నెలల వరకూ కాపాడుకోవచ్చని ఐఐటీ నిపుణులు చెబుతున్నారు. సేంద్రియ పదార్థాలతో తయారు చేసిన ఈ లేపనం పూసిన పండ్లు, కూరగాయలను తిన్న వారికి ఎటువంటి హానీ జరగదని శాస్త్రీయ పరీక్షల్లో రుజువైందంటున్నారు.

బంగాళాదుంపలు, టొమాటోలు, పచ్చి మిరపకాయలు, స్ట్రాబెర్రీలు, ఖాసీ మాండరిన్ రకం నారింజ పండ్లు, ఆపిల్స్, పైనాపిల్స్, కివీ పండ్లపై ఈ పదార్థాన్ని ఇప్పటికే పరీక్షించి.. వీటిని దాదాపు రెండు నెలల పాటు తాజాగా ఉంచగలిగినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పరిశోధనా బృందానికి కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ విమల్ కటియార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. వైభవ్ వి గౌడ్ మార్గదర్శకత్వం నెరిపారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ సస్టైనబుల్ పాలిమర్స్‌కు చెందిన పరిశోధకులు తబ్లీ ఘోష్, కోన మొండల్, మాండవి గోస్వామి, శిఖా శర్మ, సోను కుమార్ విజయవంతంగా పరిశోధనలు నిర్వహించారు.

లేపనంలో ఏముంది?

దునాలియెల్లా టెర్టియోలెక్టా అనే సముద్రపు నాచు సారానికి పాలీసాకరైడ్లను కలిపి ఈ లేపన పదార్థాన్ని రూపొందించారు. ఈ సముద్రపు నాచు యాంటీఆక్సిడెంట్లతో పాటు.. కెరోటినాయిడ్లు, ప్రోటీన్లు వంటి వివిధ బయోయాక్టివ్ సమ్మేళనాలను కలిగి ఉంటుంది.

ఒమేగా–3 కొవ్వు ఆమ్లంను ఉత్పత్తి చేయడానికి, అదే విధంగా జీవ ఇంధనం ఉత్పత్తికి కూడా ఈ సముద్రపు నాచును ఉపయోగిస్తున్నారు. ఒమేగా–3 కొవ్వు ఆమ్లంను వెలికితీసిన తర్వాత మిగిలే అవశేషాలను వ్యర్థాలుగా భావించి పారేసేవారు. అయితే, గౌహతి ఐఐటి పరిశోధకులు ఈ అవశేషాలను చిటోసాన్ అనే పిండి పదార్థంతో కలిపి లేపన పదార్థాన్ని రూపొందించే పద్ధతిని కనుగొన్నారు. సూక్ష్మక్రిములు, శిలీంధ్రాల నాశని లక్షణాలు కలిగిన ఈ పదార్థాలతో తయారైన లేపన పదార్థం తిన్న వారికి ఎటువంటి నష్టం కలగదని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

ఈ విధంగా తయారు చేసిన లేపన పదార్థంలో మనుషుల ఆరోగ్యానికి మేలు చేసే మెరుగైన యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయట. ఇది 40 డిగ్రీల వరకు వేడికి తట్టుకుంటుంది. లేపనం రాసిన తర్వాత చెదిరిపోకుండా ఉంటుంది. పండ్లు, కూరగాయల్లో నుంచి నీటి ఆవిరి బయటకుపోకుండా అడ్డుకుంటుంది. కాంతిని అడ్డుకునే శక్తి దీనికి ఉందని అనేక పరీక్షల ద్వారా నిర్ధారణైందని పరిశోధకులు తెలిపారు.

పరిశోధకులు ఈ పూతను జీవ భద్రత కోణంలోనూ పరీక్షించారు. వివిధ జీవ ప్రక్రియల అధ్యయనానికి ప్రయోగశాల ప్రమాణంగా పరిగణించే 'బిహెచ్‌కె21 సెల్ లైన్' ద్వారా పరీక్షించి చూశారు. ఈ లేపన పదార్థం విషతుల్యమైనది కాదని, తినదగిన ఆహార ప్యాకేజింగ్ పదార్థంగా సురక్షితంగా ఉపయోగించవచ్చని పరీక్షల్లో తేలిందన్నారు.

ఈ అధ్యయన ఫలితాలు రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ అడ్వాన్సెస్, అమెరికన్ కెమికల్ సొసైటీకి చెందిన 'ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ' సహా అనేక ప్రతిష్ఠాత్మక శాస్త్రీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. పండ్లు, కూరగాయల వృథాను అరికట్టడంతో పాటు, రైతుల వెతలను తగ్గించి మంచి ఆదాయాన్నిచ్చే ఈ అద్భుత లేపనం త్వరలోనే అందుబాటులోకి రావాలని ఆశిద్దాం.

– పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

నవంబర్‌లో కిసాన్ స్వరాజ్ సమ్మేళనం

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు, శ్రేయోభిలాషులైన వ్యక్తులు/స్వచ్ఛంద సంస్థల సమాహారం అలియన్స్ ఫర్ సస్టయినబుల్ అండ్ హోలిస్టిక్ అగ్రికల్చర్ (ఆషా). రెండేళ్లకోసారి ఆషా నెట్‌వర్క్ నిర్వహించే 'జాతీయ స్థాయి కిసాన్ స్వరాజ్ సమ్మేళనం' ఈ ఏడాది నవంబర్ 11, 12, 13 తేదీల్లో కర్ణాటకలోని మైసూరు నగరంలో జరగనుంది. భూతాపోన్నతి సంక్షోభం నేపథ్యంలో ఆహార సార్వభౌమత్వం, పౌష్టికాహార భద్రత, పర్యావరణ సుస్థిరత, రైతుల సాధికారత ప్రాథమిక సూత్రాలుగా కిసాన్ సమ్మేళనంలో చర్చాగోష్ఠులు జరుగుతాయి. పాల్గొనదలచిన ఆసక్తి గల వారు ముందస్తుగా నిర్దేశిత ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవచ్చు. 3 రోజులకు కలిపి భోజన, వసతి సదుపాయాలకు గాను మహిళా రైతుకు రూ. 800, వ్యవసాయేతర ఆదాయం లేని పురుష రైతులు, విద్యార్థులకు 1,500, స్వచ్ఛంద సంస్థలు, ఎఫ్.పి.ఓ.లకు రూ. 2,500, ఉద్యోగులు, విద్యావేత్తలకు రూ. 3,500. అక్టోబర్ 7 వరకు ఈ ఫీజులు. అదనపు ఫీజుతో పేరు నమోదుకు చివరి తేదీ అక్టోబర్ 15. నవంబర్ 14,15 తేదీల్లో మైసూరు పరిసర ప్రాంతాల్లో క్షేత్ర సందర్శనకు ఫీజులు అదనం.

పూర్తి వివరాలకు : www.kisanswaraj.in/ 70900 09911, 81055 79839 asha.kss2022@gmail.com